చిల్లర నాణేలతో వ్యాపారం..!

'టిక్కెట్‌కు సరిపడా చిల్లర ఉంటే ఎక్కండి.. లేదంటే దిగేయండి' ఇదీ ఆర్డినరీ బస్సు ఎక్కగానే కండక్టర్ చెప్పే ముందుమాట. తెలియక బస్సెక్కాక 20, 50 రూపాయిల నోటు లేకపోతే అంతే సంగతులు.. ప్రయాణికుల ముందు కండక్టర్ అడిగే మాటలకు సమాధానం చెప్పలేని పరిస్థితి. ఇక చిన్నపాటి దుకాణాల్లోనూ చిల్లర నాణేల సమస్యలు తప్పడం లేదు. మెడికల్ దుకాణాల్లో డబ్బులిచ్చి ఐదు కంటే తక్కువ చిల్లర ఇవ్వాల్సి వస్తే హాల్స్ లేదా చాక్‌లెట్‌లు చేతిలో పెట్టి పంపుతున్నారు. చిల్లర కోసం నూటికి రూ.10 నుంచి రూ.20 కమీషన్ ఇచ్చి కండక్టర్లు, చిరుదుకాణదారులు వ్యాపారుల నుంచి తీసుకోవాల్సి వస్తోంది.

- పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- చెలామణిలో కనిపించని రూపాయి, రెండు రూపాయలు, 5 రూపాయిల బిల్లలు
- రూ.10, 20, 50 నోట్లు దొరకేది కూడా అంతంత మాత్రమే
- ఆర్డినరీ బస్సుల నుంచి చిన్నపాటి కొట్ల వరకు తప్పని చిల్లర కష్టాలు
- వందకు రూ.20 కమీషన్‌తో చిల్లర నాణేలు ఇస్తున్న కొందరు వ్యాపారులు
- డిజిటల్ లావాదేవీలు ఉన్నా తప్పని ఇబ్బందులు





పలమనేరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ దశాబ్ద కాలంలో డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగినా ప్రజలకు చిల్లర సమస్య పెద్దతలనొప్పిగానే మారింది. రూ.1, 2, 5, 10 నాణెములు పెద్దగా జనం వద్ద లేవు. గతంలో పర్సులో కరెన్సీనోట్లతో పాటు నాణేలు జేబులో పెట్టుకునేవారు. ఇప్పుడు కరెన్సీలో తక్కువ అంటే రూ.10 నోటుగా మారిపోయింది. డిజిటల్ చెల్లింపులు భారీగా జరగాలనే తలంపుతో రిజర్వుబ్యాంకు సైతం నాణెముల ముద్రణ తగ్గించిందనే మాట బ్యాంకర్ల నుంచి వినిపిస్తోంది. దీంతోపాటు పది, ఇరవై, యాభై రూపాయల నోట్లు కూడా పెద్దగా చెలామణిలో లేవు. దీంతో రూపాయి అయినా ఫోన్‌పే, గూగూల్‌పే ద్వారా స్కాన్ చేసి పంపాల్సి వస్తోంది.

భలే మంచి చిల్లర బేరం..

చిల్లర్లకు డిమాండ్ ఏర్పడడంతో కొందరు చిల్లర నాణేలను సేకరించి భారీగా నిల్వ ఉంచుకుంటున్నారు. అవసరమైన వారికి నూటికి 10, 20 పట్టుకుని డబ్బులిస్తున్నారు. ఇదోమంచి వ్యాపారంగా మారడంతో చాలామంది చిల్లర్లను సేకరించడం జిల్లాలో కొత్త వ్యాపారంలా మారింది. ముఖ్యంగా కూలీలలకు డబ్బులిచ్చే రైతులు, మండీలలో రైతులకు బిల్లుల చెల్లింపులు, బస్సుల్లో చిల్లరకోసం కండక్టర్లు కమీషన్ ఇచ్చి మరీ చిల్లరను కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కనిపించని 5 రూపాయల బిల్ల

గతంలోలాగా ఐదు రూపాయల బిల్ల ఇప్పుడు కనిపించడం లేదు. ఎందుకంటే ఓ కాయిన్ ద్వారా ఐదు రేజర్‌బ్లేడ్‌లను తయారు చేసుకోవచ్చు. దీంతో కొందరు ఐదునాణెములను కొనే వ్యాపారం చేస్తున్నారు. ఇది డబుల్ ప్రాఫిట్ కావడంతో ఇవి పెద్దగా కనిపించడం లేదు.

పది అంగళ్లు తిరిగినా దొరకలేదు



పిల్లలకు పెన్సిళ్లు, పెన్నులు దుకాణంలో తీసుకున్నా వందిస్తే చిల్లర లేదు. నాదగ్గర ఫోన్‌పే లాంటివి లేవు. కొన్నాక.. అక్కడ పెట్టి చిల్లర తెమ్మన్నారు. దీంతో వందకు చిల్లర కోసం పది అంగళ్లు తిరిగినా ఎవరూ ఇవ్వలేదు. దీంతో పండ్ల దుకాణంలో అరటిపండ్లు తీసుకుంటే చిల్లర దొరికింది. దాన్ని తీసుకెళ్లి వారికిచ్చా. రూ.22 కోసం రూ.50 ఖర్చు పెట్టాల్సి వచ్చింది.

– సుబ్రమణ్యం రెడ్డి, చెన్నుపల్లి

అడ్జస్ట్ చేసుకున్నాం..



నేను ఈమధ్య బస్సుఎక్కితే లేడీ కండక్టర్ చిల్లర ఉండాలని ముందుగానే చెప్పింది. సరే అర్జెంట్ కాబట్టి బస్సెక్కాక రూ.200 నోటిచ్చా. రూ.30 టిక్కెట్‌కు రూ.200 ఇస్తే ఎలాగని మండిపడింది. బస్సెక్కినోళ్లంతా వంద, రెండొండలు, ఐదొండలు నోట్లిస్తే మేము ఎక్కడి నుంచి చిల్లర తేవాలని అగ్గిమీద గుగ్గిలమైంది. టిక్కెట్ వెనకాల చిల్లర రాసి దిగేటప్పుడు ఇద్దరికి కలిపి చిల్లరిచ్చింది. దీంతో మేమిద్దరం అరగంట కష్టపడి ఏదో వస్తువు కొనుక్కుని ఆపై అడ్జస్ట్ చేసుకున్నాం.

– విజయ్‌స్వామి, కీళపట్ల

క్లుప్తంగా

రేషన్ పంపిణీలో అక్రమాలపై ఫిర్యాదు

పుంగనూరు: పేదలకు అందించే రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడడంతో పాటు సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు శనివారం తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు మున్నా మాట్లాడుతూ కొందరు డీలర్లు ప్రతి నెలా స్టాక్ తక్కువ వస్తోందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ రాముకు ఫిర్యాదు చేశామన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి వెంకట్రమణారెడ్డి, సీపీఐ కార్యదర్శి రామ్మూర్తి హెచ్చరించారు.

ఘనంగా వార్షికోత్సవం



పెద్దపంజాణి: మండలంలోని తులసమ్మ గుడి ఎంపీపీ పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హరిప్రసాద్ మాట్లాడుతూ మంచి నైతిక విలువలు కలిగిన సమాజం ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. సర్పంచ్ రుద్రమూర్తి మాట్లాడుతూ మన స్కూళ్లను మనమే బలోపేతం చేసుకోవాలని, నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పీఎంసీ చైర్‌పర్సన్ మాధవి చేతుల మీదుగా ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, పీఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా కుష్టుకు చికిత్స



చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకట ప్రసాద్

చౌడేపల్లె: శరీరంపై స్పర్శలేని తెల్లటి మచ్చలు ఉంటే ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కుష్టు, క్షయ నివారణాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. టీబీ, హెచ్‌ఐవీ కేసుల గురించి ఆరా తీశారు. టీబీ వ్యాధిగ్రస్తులు ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు కోడిగుడ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ఎంసీఆర్ చెప్పులతో పాటు వైద్యుల సూచనలను పాటించాలన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వి.కోట: ప్రభుత్వ స్కూళ్లలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధనతో పాటు ఉత్తమ విద్య అందుతుందని ప్రభుత్వ ఉపాధ్యాయులు సూచించారు. శనివారం మండలంలోని పలు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను కలిసి 2025–2026 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనే చేరాలని, బడిఈడు పిల్లలను చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

గుడుపల్లె: మండలంలోని ఒంటిపల్లె సమీపంలోని ప్రసన్న శ్రీరాళ్లగంగమాంబ ఆలయంలో శనివారం అగ్నిగుండం పచ్చిగెరిగెను వైభవంగా నిర్వహించారు. 12 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలతో అలంకరించి సింహవాహనంపై అధిష్టింపజేశారు. అమ్మవారి ఉత్సవం, పచ్చిగెరిగెను పలక వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయం వద్ద వేసిన అగ్నిగుండంలో భక్తులు అమ్మవారి ఉత్సవాన్ని ఎత్తుకుని పచ్చిగెరిగెను అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ అగ్నిగుండం ప్రవేశానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



గంగవరం : ఊరి కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన ఘటన గంగవరం మండలంలో శనివారం జరిగింది. కీలపట్ల బీట్ పరిధిలోని ఫారెస్ట్ నుంచి రెండు దుప్పులు మండలంలో అటవీ ప్రాంతానికి సమీపంలోని బూడిదపల్లి గ్రామానికి వచ్చాయి. గ్రామానికి ఆనుకుని మామిడితోటకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెలో ఒక దుప్పి చిక్కుకోగా ఊరి కుక్కలు దుప్పిపై దాడి చేశాయి. ఈ దాడిలో దుప్పి అక్కడికక్కడే మృతి చెందగా మరో దుప్పి తప్పించుకుని పారిపోయింది. గమనించిన స్థానికులు దుప్పి మృతి చెందిన విషయాన్ని అటవీ సిబ్బందికి సమాచారం అందజేశారు. సెక్షన్ ఆఫీసర్ సుకుమార్‌తో పాటు పలువురు అక్కడికి చేరుకుని దుప్పిని పరిశీలించారు. కీలపట్ల వెటర్నరీ డాక్టర్ ప్రియాంక దుప్పికి పంచనామా నిర్వహించి అక్కడే ఖననం చేశారు.

నోటీస్ బోర్డు

నేడు ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆదివారం వారాహి గ్రూప్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పూలహేమంత్ రాయల్ తెలిపారు. శనివారం బెంగళూరుకు చెందిన వైదేహి సూపర్ స్పెషాలిటీ వారి ఆధ్వర్యంలో అన్నిరకాల జబ్బులకు వైద్యసేవలు అందించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంటలో ఉన్న మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు ఎంట్రన్స్ టెస్ట్ ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టిఎస్.రమ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షలు రాసే వారు ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. అలాగే విద్యార్థులు హాల్‌టికెట్, బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను, ప్యాడ్ తెచ్చుకోవాలని సూచించారు. అలాగే హాల్‌టికెట్లను ఈసేవా, ఇంటర్నెట్ సెంటర్లలో పొందాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రొంపిచెర్ల: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. ఆమె శనివారం బొమ్మయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహార పక్షోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గర్భిణులు ఎండకు ఎక్కువ తిరగరాదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, మహిళా పోలీసు రేష్మా, ఏఎన్‌ఎం గాయత్రి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-వేస్ట్‌తో పర్యావరణానికి ముప్పు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమ



బైరెడ్డిపల్లెలో..

పలమనేరు: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పలమనేరులో శనివారం మున్సిపల్, మెప్మా అధికారులు విద్యార్థులతో కలసి స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వేస్ట్‌లను మున్సిపల్ కా ర్మికులు జాగ్రత్తగా తీసుకెళ్లేలా ప్లాన్ చేసుకోవా లని సూచించారు. మనం నిత్యం పడేసే చెత్తతో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేయకుండా డంపింగ్‌కు చేర్చాలన్నారు. పర్యా వరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, మెప్మా మేనేజర్ బాబా, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఈ–వేస్ట్ వ్యర్థాలపై అవగాహన

బైరెడ్డిపల్లె: మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలు బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ అన్నారు. స్వర్ణాంధ్రా, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కడపనత్తం, టీఎస్‌కుప్పం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపినప్పుడు గ్రామాలు శుభ్రంగా ఉంటాయన్నారు. బైరెడ్డిపల్లెలో ఈ–వేస్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్, మండల రీసోర్స్ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు సదాశివయ్య, బాలాజీ, రెహనాభాను పాల్గొన్నారు.

ఘనంగా గంగమాంబ జాతర



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పెద్దపల్లి గంగమాంబ

కుప్పం: పట్టణంలోని కొత్తపేటలో కొలువుదీరిన శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ జాతర మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, పచ్చగెరిగె, బాణసంచా వేడుకల నడుమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 13 రోజుల పాటు జరిగిన ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కొత్తపేట, పాతపేట, తంబిగానిపల్లి గ్రామ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. చివరి రోజు శనివారం మధ్యాహ్నం శ్రీ రామ పట్టాభిషేకం హరికథ, రాత్రి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వీటితో పాటు కీలుగ్రురం, బుర్రకథ, పాట కచేరి వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ముత్యాలపల్లకీలు పట్టణ పురవీధుల్లో పలక వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు.

నేడు పొంగళ్లు..

శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమాంబ జాతరలో భాగంగా ఆదివారం పొంగళ్లు, దీపారాధన, వసంతోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పొంగళ్లు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. నేతి దీపాలు, పొంగళ్లతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు.



ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం..కల్యాణం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు మండలంలోని బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెలో శనివారం స్థానిక సర్పంచ్ నాగమ్మ, కోదండ దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

టపాకాయల గోదాముల తనిఖీ

చౌడేపల్లె: టపాకాయల గోదాములను ఎస్‌ఐ నాగేశ్వరరావు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీలు చేశారు. నిల్వలు ఉన్న ప్రదేశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వారి వెంట ఆర్‌ఐ భారతి, వీఆర్వో శ్రీపతి రెడ్డి ఉన్నారు.

లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయండి



ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమలకుమారి, డీఎస్పీ

సదుం: ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వ సేవల కోసం అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని అడిషనల్ ఎస్పీ విమల కుమారి, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి సూచించారు. అవినీతికి పాల్పడే అధికారుల వివరాలను అడిషనల్ ఎస్పీ(తిరుపతి) 9440446130, డీఎస్పీ 9440446190, ఇన్‌స్పెక్టర్లు 9440446193, 9440446120, 9440808112, 9440446138 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

పుంగనూరు/రొంపిచెర్ల: విద్యార్థులు మానసికంగా ఉల్లాసంగా ఉండాలని కెరీర్ మెంటల్ హెల్త్ జిల్లా కౌన్సిలర్ హేమలత అన్నారు. ఆమె కేజీబీవీలో శనివారం 'పరీక్షలు–మార్కులే జీవితమా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆశించిన స్థాయిలో మార్కులు రాకపోయినా.. ఒత్తిడికి గురి కాకుండా విజయం సాధించాలన్నారు. అధ్యాపకులు కేవలం పరీక్షలు, మార్కులకే ప్రాధాన్యత ఇవ్వకుండా జ్ఞాన సంపాదన, క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల వంటి లక్షణాలు జీవిత విజయానికి కీలకమని తెలిసేలా చేయాలన్నారు. ఆట పాటలతో విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు పేద పిల్లలకు ప్రభుత్వం కేజీబీవీల్లో అన్నిరకాల సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.



కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ హేమలత

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

రొంపిచెర్ల: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ద రెడ్డెప్పరెడ్డిని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఇటీవల రెడ్డెప్పరెడ్డి అనారోగ్యం బారిన పడి శ్రీచక్ర ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న విషయం స్థానిక నాయకులు పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన పీలేరులోని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మూడు రోజులల్లో కుమార్తె వివాహం ఉందని ధైర్యంగా ఉండాలని రెడ్డెప్పరెడ్డికి ధైర్యం చెప్పారు.



పెద్ద రెడ్డెప్పరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

నూతన వధూవరులకు ఆశీర్వాదం

మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీ కాకులారంపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి సిద్దారెడ్డి మనవడు మనోజ్ కుమార్ రెడ్డి, సుస్మిత వివాహ మహోత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, చెంచురెడ్డి, పెద్దిరెడ్డి దేవేంద్ర రెడ్డి, కమలాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, అమరనాథరెడ్డి, విజయశేఖర్, సూర్య నారాయణ రెడ్డి, శ్రీనాథనాయుడు, మునికృష్ణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, అల్లాబక్స్, మహబుబ్‌బాషా, రాజాసాహెబ్, కాలేషా, వెంకటరత్నం, శ్రీనాథరెడ్డి, వెంకటనాగులు, నాగిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

చౌడేపల్లె: చెత్తరహిత గ్రామాలను తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ లీలామాధవి సూచించారు. శనివారం దిగువపల్లె సచివాలయం వద్ద స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సోని అధికారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. చెత్తను గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. చెత్తసేకరణ కేంద్రాల ద్వారా సంపద సృష్టించి పంచాయతీలను స్వచ్ఛ గ్రామాలుగా రూపొందిద్దామని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: పరిసరాల శుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పీహెచ్‌సీ డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్ అన్నారు. శనివారం రొంపిచెర్ల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ ఉన్న ముళ్ల కంపలను తొలగించి చెత్త చెదారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మేజర్ పంచాయతీ వి.కోటలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై సర్పంచ్ పీఎన్ లక్ష్మి, ఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబరు కుమార్ రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.



దిగువపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

హిందువులకు రక్షణ కల్పించాలి





పుంగనూరు: ర్యాలీ చేస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు, పలమనేరు: ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పుంగనూరు: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులు, హత్యలను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ శనివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించి, ఆ రాష్ట్ర సీఎం ఫొటోలను దగ్ధం చేశారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక ప్యాలెస్ ఆవరణ నుంచి కార్యకర్తలు పట్టణంలో ఎర్రజెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువులకు రక్షణ కల్పించకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

పలమనేరు: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై సాగుతున్న మారణహోమాన్ని కేంద్రం జోక్యం చేసుకుని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ పిలుపుమేరకు స్థానిక నేతలు పలమనేరు పట్టణంలో శనివారం మానవహారం, ధర్నాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మిలిటరీ సిద్ధయ్య మాట్లాడుతూ హిందువులపై దాడులు జరుగుతున్నా.. పశ్చిమబెంగాల్లోని ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. ఆపై వారు స్థానిక ఆర్డీఓ భవానీకి వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం కలిగిస్తే కేసులు

పుంగనూరు: పట్టణంలోని ప్రజల రాకపోకలకు ఎవరైనా అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని నూతన సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన ఎస్‌ఐ లోకేష్, సిబ్బందితో కలసి ఎంబీటీ రోడ్డు, నాగపాళెం, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, గోకుల్ సర్కిల్, కొత్తపేట సర్కిల్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అలాగే దుకాణాదారులు బోర్డులను రోడ్డులో పెట్టడం, తమ దుకాణాల ముందు వాహనాల పార్కింగ్‌ను ఇష్టానుసారంగా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదన్నారు. దుకాణాదారులు తమ వస్తువులను, బోర్డులను తమ అంగళ్ల ముందు పెట్టరాదన్నారు. రోడ్డు ఆక్రమిస్తున్న పలువురికి ఆయన వార్నింగ్ ఇచ్చారు. తక్షణమే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పుంగనూరు ఎంబీటీ రోడ్డులో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న సీఐ